

సంసారంలో సరిగమలు - తమస్విని



(ప్రతి సంసారంలోనూ వినిపించే రాగాలు..

కొన్ని సరదాలు, కొన్ని సరాగాలు,

కొన్ని సరసాలు, ఇంకొన్ని విరసాలు, మరికొన్ని విషాద గీతాలు..

వెరసి సంసారంలో సరిగమలు..!)

ఫేమిలీ పిక్చర్

ఆకాశ్ కారు గరాజ్‌లో పెట్టి, బూట్లు విప్పి, లివింగ్ రూం తలుపు తోసాడు. లోపల నించి అమ్మానాన్నల వాగ్వాదం వినిపిస్తోంది.

"మళ్ళీ మొదలు పెట్టారు" విసుక్కున్నాడు.

"కొసరాజంటే నమ్మరే? అది ఆయన స్టైలే!" దేవిక స్వరం పెంచి చెప్పింది.

"సదాశివబ్రహ్మం అంటే వినవుగా! నీ మతమే నీది" గోపాలరావు నిరసనగా చెప్పాడు.

"ఈసారేమిటి?" ఆకాశ్ తల్లి పక్కన కూర్చుంటూ అడిగాడు.

ఆమె రిమోట్ అందుకుని, మళ్ళీ ఆ పాత పాట ప్లే చేసి కొడుకుతో చెప్పింది.

"ఈ పాటని కొసరాజు రాసాడంటే, మీ నాన్న వినరుగా."

"సదాశివబ్రహ్మం అన్నానా?" ఆయన కోపంగా అరిచాడు.

"గూగుల్లో చూస్తే తెలిసేదిగా? ఈ గొడవంతా ఎందుకు?"

ఆకాశ్ జేబులోంచి ఫోన్ తీసాడు. ఆ పాట పల్లవి విని సెర్చ్ చేసి చెప్పాడు.

"శ్రీశ్రీ రాసాడట."

"శ్రీశ్రీ ఇలాంటి పాటలు కూడా రాస్తాడా?" దేవిక ఆశ్చర్యపోయింది.

"తప్పేమోరా. శ్రీశ్రీ స్కూల్ కాదు ఇది. ఈ గూగుల్‌ని నమ్మడానికి లేదు" గోపాలరావు కొడుకు అజ్ఞానానికి జాలిపడుతూ చెప్పాడు.

"నేను నిర్ఘాంతపోయాను" దేవిక చెప్పింది.

ఆకాశ్ లేచి బెడ్‌రూములోకి వెళ్ళిపోయాడు.

దేవిక, గోపాలరావు హ్యూస్టన్ వచ్చి వారమైంది.

వాళ్ళు టిక్కెట్లు బుక్ చేసుకున్నప్పటి నించి వచ్చేదాకా ఆకాశ్ తెగ సంబరపడిపోతాడు. ఇంకా పది రోజులు, ఇంకా వారం రోజులు, అని కౌంట్‌డౌన్ చేసుకుంటాడు. కానీ వాళ్ళు వచ్చాక అతనిలో చిరాకు, అసహనం పెరిగిపోతాయి.

గోపాలరావు దంపతులకి ఒక్క నిమిషం పడదు. ఎడ్డమంటే తెడ్డం. ఎప్పుడూ వాదులాటలే. అవి కుటుంబపరమైనవి కాదు. ఆ సినిమాకి దర్శకుడు ఫలానా అంటే, కాదు ఫలానా అని, ఒరిస్సా రాజధాని భువనేశ్వర్ అంటే, కాదు కటక్ అని హోరాహోరీగా పోట్లాడుకుంటారు. తర్వాత ఇద్దరూ కలిసి కారప్పూస నములుతూ పాత తెలుగు హిందీ సినిమాలు చూస్తుంటారు. అరగంట గడవక మునుపే, అల్లు రామలింగయ్య మొదటి సినిమా ఏది? దగ్గర వివాదం మొదలవుతుంది.

ఆకాశ్ ఫోన్ మోగింది. భార్య నించి.

"ఇంటికి వెళ్ళిపోయావా? నాకింకా అరగంట పడుతుంది" చెప్పింది.

"ఆ. వచ్చేసాను. మీ అత్తగారు, మామగార్ల తగాదా తీర్చి ఇప్పుడే లోపలికి వచ్చా."

శ్రియ గలగల నవ్వింది.

"పోన్లేపాపం. వాళ్ళకి అదో కాలక్షేపం" చెప్పింది.

"కాలక్షేపానికి ఏం తక్కువ తల్లీ? ఆ బ్లాక్ అండ్ వైట్ సినిమాలు చూసి చూసి, మనది కలర్ టీవీ అని మర్చిపోయా. వాళ్ళ కాలానికి తగినట్లు కనీసం కృష్ణ శోభన్‌బాబు సినిమాలు కూడా చూడరు. ఆ కన్నాంబ, కాంచన మాలలు ఇంత పెద్ద గొంతుతో మాట్లాడుతుంటారు. ఆ సౌండు చాలదన్నట్లు వీళ్ళ వాదనలు."

"సరే సరే. ఇంటికి వచ్చాక మాట్లాడుకుందాం" శ్రియ ఫోన్ కట్ చేసింది.

"పేరెంట్స్ వచ్చారట కదా ఆకాశ్? అంకుల్ మెసేజ్ చేసారు" లంచ్ టైములో పృథ్వీ అడిగాడు.

"అవున్రా. ఇంటిని కిష్కింధ చేస్తున్నారు" ఆకాశ్ చెప్పాడు.

"వాదనలో ఎవరూ తగ్గడం లేదా? చిన్నప్పటినించి మనకి అలవాటేగా" పృథ్వీ నవ్వాడు.

"అప్పుడు నాన్నకి వర్క్ ఉండేది కాబట్టి ఇంత తీరిక లేక ఆపేసేవారు. ఇప్పుడంతా తీరికే. ఇంటికి వెళ్ళాలంటేనే భయమేస్తోంది.పిచ్చెక్కిపోతోంది అనుకో. ఎప్పుడు వెళ్తారా అనిపిస్తోంది" ఆకాశ్ విసుగ్గా చెప్పాడు.

"ఛ. అదేం మాట? అమ్మానాన్న ఇంట్లో ఉంటే ఎంత కన్నుల పండుగలా ఉంటుందిరా."

"కన్నుల పండుగ! ఈ మాట మా అమ్మతో చెప్పు. నా కళ్ళు చెమ్మగిల్లాయి అంటుంది."

"ఆంటీ మనసులోని భావాలని బయటికి చెప్పటం మానలేదా? శుక్రవారం రాత్రి వచ్చి కలుస్తాను" పృథ్వీ నవ్వి చెప్పాడు.

ఆకాశ్ ఇంటికి వచ్చేసరికి యధాప్రకారం తల్లితండ్రులు శారద సీనియరా లేక వాణిశ్రీ ముందు వచ్చిందా అనే విషయం మీద వాదించుకుంటున్నారు.

"నాన్నా. పృథ్వీకి టెక్స్ట్ చేసావుట కదా. ఈ ఫ్రైడే వస్తానన్నాడు" చెప్పాడు.

"వాడికి నేను చేసే సాంబారంటే ఎంత ఇష్టమో! భోజనానికి వచ్చేయమన్నావా?" దేవిక అడిగింది.

"వాడికి నువ్వు చేసే గుత్తి వంకాయ కూడా ఇష్టం" గోపాల్రావు చెప్పాడు.

"అది మీకు తినాలని ఉంటే చెప్పచ్చుగా? చేస్తాలే" దేవిక హామీ ఇచ్చింది.

"ఏం కాదు. వాడి వాడి కోసమే చెప్పా. వీళ్ళిద్దరూ ఇంటర్మీడియట్ చదివేటప్పుడు ఒకసారి చెప్పాడు" గోపాల్రావు ఉక్రోషంగా చెప్పాడు.

"నాన్నా ప్లీజ్ ఆ టీవీ సౌండ్ తగ్గించు. ఇప్పుడేగా వచ్చాను. కాస్త ప్రశాంతంగా ఉండనివ్వండి" ఆకాశ్ విసుగ్గా చెప్పాడు.

"మీ అమ్మకి చెవుడొచ్చిందిరా. ఎంత సౌండ్ పెట్టినా వినబడటంలేదు" గోపాల్రావు రిమోట్‌తో టీవీ వాల్యూం తగ్గిస్తూ చెప్పాడు.

"నాకు చీమ చిటుక్కుమంటే వినిపిస్తుంది. మీకే వినపడదు. వినపడక సౌండ్ పెట్టుకుని నామీద చెప్తున్నారు" దేవిక గొంతు పెంచి అరిచింది.

ఆకాశ్ లోపలికి వెళ్ళిపోయాడు.

బెడ్రూములో శ్రియ ఫోన్లో ఇన్‌స్టాగ్రాం చూసుకుంటోంది.

"వాళ్ళు అలా కొట్టుకుంటుంటే సర్ది చెప్పచ్చుగా?" భార్యని నిష్ఠూరంగా అడిగాడు.

"ఎందుకంత సీరియస్‌గా తీసుకుంటావు? వాళ్ళకి ఒకరంటే ఇంకొకళ్ళకి ఎంత ప్రేమో తెలుసా? ఎప్పుడూ ఇద్దరు ఒకచోటే ఉంటారు. వాళ్ళేమైనా ఆస్తుల కోసం కొట్టుకుంటున్నారా? పిల్లల గురించా? శారద, వాణిశ్రీ గురించేగా? ఇంకో వాదన వస్తే ఇది మానేస్తారు. కూల్‌గా ఉండు" శ్రియ చెప్పింది.

"ఆకాశ్. కాఫీ తాగుతావా?" దేవిక బయటినించి అరిచింది.

"వద్దమ్మా. రాత్రి మళ్ళీ నిద్రపట్టదు. ఒకేసారి అన్నం తినేస్తా" చెప్పాడు.

"అన్నం తినడానికి టైం ఉందిగా ఈలోగా ఏదన్నా తిను. పొద్దున ఎప్పుడు తిన్నావో" గోపాల్రావు చెప్పాడు.

"ఏమొద్దు. అమ్మా. అన్నం వండేయ్. ఏడింటికల్లా తినేస్తాను" చెప్పాడు.

గోపాల్రావు టీవీ ఆపేసి భార్య వెనక వంటగదిలోకి వెళ్ళాడు.

"చేతులు శుభ్రంగా కడుక్కోండి. ఉల్లిపాయలు తరుగుదురుగాని" దేవిక ఆజ్ఞాపించింది.

"అత్తయ్యా. నేను కట్ చేస్తాను" శ్రియ బయటికి వచ్చి చెప్పింది.

"నువ్వు కూడా వాడిలాగే పగలంతా పని చేసి వచ్చావు. హాయిగా ఇద్దరు కబుర్లు చెప్పుకోండి. నేను పిలిచినప్పుడు వచ్చి తింటే చాలు, అదే పెద్ద సాయం" దేవిక తిరస్కరించింది.

డైనింగ్ టేబుల్ మీది పదార్ధాలు చూసి ఆకాశ్ అసహనంగా అడిగాడు.

"ఇన్ని రకాలు చేస్తావేంటమ్మా? నేను జిమ్ లో ఎంతసేపు పరిగెత్తాలి చెప్పు. ఒకటి చాలదా?"

"మూడు రకాలే కదరా. ఒక్కోటి ఒక్కో ముద్ద తినుపోనీ" దేవిక చెప్పింది.

"మీరు చేసేది ఒక్క ముద్దతో ఆపలేం అత్తయ్యా. నా వల్ల కూడా కాదు" శ్రియ చెప్పింది.

దేవిక నిస్సహాయంగా చూసింది.

"నా హృదయం బాధపడుతోంది" చెప్పింది.

"అమ్మా. దయచేసి నీ ఎమోషన్స్ బయటకి చెప్పకు" ఆకాశ్ అరిచాడు.

శ్రియ నిశ్శబ్దంగా మూడు అయిటమ్స్ వడ్డించుకుని తినసాగింది.

"నా కోడలు బంగారం. భానుమతి అత్తగారి కథల్లో కోడలు లాంటిది. తామరాకు మీద నీటిబొట్టు" దేవిక మెచ్చుకుంది.

"భానుమతి అత్తగారి కథల్లో కోడలు అంటే భానుమతే కదా? నా కోడలు భానుమతి లాంటిదని చెప్పొచ్చుగా?" గోపాల్రావు అడిగాడు.

"అదే మరి తమరి తెలివి. భానుమతంటే ఏ సినిమాలో అంటారు కానీ, ఏ పుస్తకంలో అనరు కదా?" దేవిక పాయింట్ తీసింది.

"మీరు కూడా మాతో తినేయండి అమ్మా. మరీ అర్ధరాత్రి దాకా తినరు" ఆవేశం తగ్గిన ఆకాశ్ ఆహ్వానించాడు.

"మీరు తినండి, మేము తర్వాత తింటాం. బాక్సుల్లో ఏం పెట్టాలో చెప్పండి. బాక్స్‌లు సర్దేసి తింటాం" తిరస్కరించింది.

"అమ్మా, నేను తింటాం లేరా. ఇప్పుడే తింటే అర్ధరాత్రి మళ్ళీ ఆకలవుతింది. మీరు ప్రశాంతంగా తినండి" గోపాల్రావు టీవీ మ్యూట్‌లో పెట్టి చూస్తూ చెప్పాడు.

ఆకాశ్ రెండు ఐటమ్స్ రెండు ముద్దలు తిని లేచాడు.

"అదేంట్రా చిన్న పిల్లాడి కంటే కనాకష్టం" దేవిక బాధపడింది.

"అమ్మా. నువ్వొచ్చి వెళ్ళినప్పుడల్లా కనీసం పదికిలోలు బరువెక్కుతున్నాను. రోజుకి ఎన్ని మైళ్ళు పరిగెత్తాలి చెప్పు? నాకెంత కావాలో అంత తింటాను. వదిలెయ్" విసుగ్గా చెప్పాడు.

"కాదు నాన్నా. పగలంతా పని చేసి వస్తావు.."

"ఆఫీసుల్లో బండలు మోయటం, కొండలు పగలకొట్టటం చేయమమ్మా. నాన్న బేంక్‌లో ఎలా కూర్చుని పనిచేసేవారో, మేమూ అంతే. మాకు ఈ ఫుడ్ చాలు."

ఆకాశ్ లేచి ప్లేట్ సింక్‌లో పెట్టి, చెయ్యి కడుక్కుని వెళ్ళిపోయాడు.

"నేను చిన్నబుచ్చుకున్నాను" దేవిక విచారంగా చెప్పింది.

ఆకాశ్. తన వెనకే వచ్చిన శ్రియని చూసి అడిగాడు.

"నువ్వూ చెయ్యి కడుక్కుని వచ్చేసావా? అమ్మకి కొంచెం హెల్ప్ చేయొచ్చుగా."

"వెళ్తాను. వాళ్ళు తినాలిగా" మంచం మీద వాలింది.

గంట తరువాత ఆకాశ్ బయటికి వెళ్తే, టేబుల్ తుడుస్తున్న తండ్రి, గిన్నెలని డిష్ వాషర్లో సర్దుతున్న తల్లి కనిపించారు.

"ఈ పనులు చేయద్దన్నాను కదా అమ్మా. ఇండియాలో నాన్న ఎప్పుడైనా కిచెన్లోకి వచ్చారా? నువ్వు అంట్లు తోమావా? పనమ్మాయి రాకపోతే పక్కవాళ్ళ పనమ్మాయిని పిలిచేదానివి. ఇక్కడికి వచ్చి ఈ పనులేంటి? నువ్వు చేసే వంటలు శ్రియ చేయలేదు కాబట్టి నువ్వు వంట మాత్రమే చెయ్యి. నాన్నా నువ్వెళ్ళి టీవీ చూసుకో."

ఆకాశ్ తండ్రి చేతిలోని నేప్‌కిన్‌ని తీసుకున్నాడు.

"అబ్బాయ్. కూరగాయలు లేవు. గ్రోసరీ స్టోర్‌కి వెళ్దాం" దేవిక చెప్పింది.

ఆకాశ్ నిస్సహాయంగా చూశాడు.

"మీ కోడలితో వెళ్ళండి" చెప్పాడు.

"నీ దగ్గరున్న చనువు ఆ అమ్మాయి దగ్గర ఉండదుర. పద. శుక్రవారం పృథ్వీ వస్తానన్నాడు కూడా. అవునూ వాడింకా పెళ్ళి చేసుకోలేదేంటి? నీ ఈడు వాడు."

"అమ్మా. నీకు పుణ్యం ఉంటుంది. వాడిని అడక్కు. వాడసలే లవ్ ఫెయిల్యూర్‌తో డిప్రెస్డ్‌గా ఉన్నాడు" ఆకాశ్ అర్ధించాడు.

"అవునా అయ్యో పాపం. నాకంతమాత్రం తెలీదా. నిన్నడుగుతున్నాను కానీ వాడిని ఎందుకు అడుగుతాను?" దేవిక సానుభూతిగా చెప్పింది.

గ్రోసరీ స్టోర్స్‌లో గోపాలరావు కొనమన్నవి దేవికకి 'వేస్ట్' దేవిక కొందామన్నవి గోపాలరావుకి 'అనవసరం' ప్రతిదానికి గొడవపడే తల్లితండ్రులతో ఆకాశ్‌కి తలనొప్పి వచ్చింది.

సూషీ కౌంటర్ చూసి గోపాలరావు అడిగాడు.

"అబ్బాయ్. నాకు సూషీ కొనిపెట్టరా."

"ఎందుకు దండగ? నాలుగు చల్లటి అన్నం ముద్దలు ఎనిమిది డాలర్లట. కావాలంటే ఇంటికి వెళ్ళాక నేనే చద్దన్నం నాలుగు ముద్దలు చేసి అరిటాకులో చుడతాను" దేవిక అడ్డుపడింది.

"తమరి తెలివితేటలంతే. అది చద్దన్నం కాదు. అందులో హెర్బ్స్ వేస్తాడు. అరిటాకు కాదు. సీవీడ్. అది కూడా తెలీదు" గోపాలరావు వెటకారంగా చెప్పాడు.

"వేడి వేడిగా వంట చేసి తినటానికి పిలిస్తే రారు. కమ్మగా తినడానికి బాధ. ఈ చేపల కంపు కొట్టే అన్నం ముద్దల మీద మోజు. అంతేలే."

"అమ్మా! ఆపుతావా? నాన్నేదో ముచ్చట పడ్డారు. తిననివ్వరాదా?" ఆకాశ్ కసురుకున్నాడు.

"నాకు కోపం వచ్చింది" చెప్పి దేవిక ఫ్రోజెన్ సెక్షన్‌కి వెళ్ళింది.

ఇంటికి వచ్చాక శ్రియ నవ్వుతూ అడిగింది.

"ఎలా అయింది గ్రోసరీ షాపింగ్?"

ఆకాశ్ భార్యని కోపంగా చూసాడు.

శుక్రవారం రాత్రి పృథ్వీ వచ్చాడు. గోపాలరావు, దేవిక అతన్ని తమ మధ్య కూర్చోపెట్టుకుని కబుర్లు చెప్పారు.

"ఎల్ కేజీనించి ఫ్రెండ్స్. మాస్టర్స్ ఒకే కాలేజ్‌లో చదివి, ఒకే ఆఫీస్‌లో ఉద్యోగం చేయటం చాలా గొప్ప" గోపాలరావు మెచ్చుకున్నాడు.

"అవును. ఒకరికొకరు తోడున్నారనే వాళ్లమ్మ, నేను నిశ్చింతగా ఉన్నాం" దేవిక ఏకీభవించింది.

ఇద్దరూ పోటీపడి అతనికి తినిపించారు.

ఇంటికి వెళ్ళేప్పుడు తనతో బయటికి వచ్చిన ఆకాశ్‌తో చెప్పాడు పృథ్వీ.

"నువ్వు ఎంత లక్కీరా! ఆంటీ అంకుల్ ఉంటే ఎంత నిండుతనం వచ్చింది?"

"నిండుతనమా? వాళ్ళు వచ్చినప్పటినించి ప్రశాంతత లేదు తెలుసా? ప్రతి దానికి వాదనే. మళ్ళీ ఎవరి దారిన వాళ్ళుండరు. పక్కపక్కనే ఉండాలి. నాకు శ్రియతో గొడవ వస్తే రెండో బెడ్రూములో పడుకుంటా. వీళ్ళు అలా కాదు. సుందోపసుందులు" ఆకాశ్ కోపంగా చెప్పాడు.

"వాళ్ళని అపార్థం చేసుకున్నావు. అభిప్రాయాలు కలవక, అరుచుకుంటారు కానీ, అవి మనసుని బాధపెట్టే అంశాలు కాదు. అమ్మానాన్న ఉంటే ఎంత అదృష్టమో నీకు తెలియదు. ఒప్పుకున్నా, ఒప్పుకోకపోయినా నువ్వు లక్కిరా. నాకు ఆ అదృష్టం లేదు. తెలుసుగా మా అమ్మకి విపరీతమైన మోకాళ్ళ నొప్పులు. అన్ని గంటలు విమానంలో కూర్చోలేనంటుంది. బిజినెస్ క్లాస్‌లో టికెట్ కొంటానంటే, డబ్బులు వేస్ట్ అంటుంది. మిడిల్ క్లాస్ మెంటాలిటీ. వచ్చి, వాళ్ళు నాతో ఉంటే నాకు కలిగే ఆనందాన్ని ఎన్ని డబ్బులు కాంపెన్సేట్ చేయగలవు? నాన్నేమో పెళ్ళి చేసుకో వస్తాం అంటారు. పెళ్ళికి, కొడుకు దగ్గరికి రావటానికి సంబంధం ఏమిటి? శ్రియ మంచిది కాబట్టి సర్దుకుపోతుంది. నేను చేసుకునే అమ్మాయికి అమ్మానాన్నల అలవాట్లు నచ్చకపోతే అదో గొడవేగా?" పృథ్వీ బాధగా చెప్పాడు.

"ఏం లక్కీనో. చిరాకు పుడుతోంది" ఆకాశ్ చెప్పాడు.

"చూడు. ఆంటీ వాళ్లకి హైదరాబాద్‌లో ఇల్లు ఉంది. బంధువులు, ఫ్రెండ్స్ ఉన్నారు. వాళ్ళకొక సొసైటీ ఉంది. నిశ్చింతకరమైన జీవితం ఉంది. అలాంటిది వాళ్ళు ఇక్కడికి వచ్చి, నీ ఇంట్లో ఉండి, అన్ని పనులు చేసిపెట్టి, మిమ్మల్ని ప్రేమగా చూసుకుంటున్నారంటే, దానికి కారణం నీమీదున్న ప్రేమ. అంతే తప్పించి మరేదీ వాళ్ళని ఇక్కడ కట్టిపడెయ్యలేదు. వాళ్ళు వాళ్ళ జీవితంలోని విలువైన రెండు మూడు నెలల కాలం నీకోసం వెచ్చిస్తున్నారన్నది నువ్వు అర్థం చేసుకోవడంలేదు" పృథ్వీ వెళ్ళిపోయాడు.

ఆకాశ్ కారు గరాజ్‌లో పెట్టి, బూట్లు విప్పి, లివింగ్ రూమ్ తలుపు తోసాడు.

ఇల్లంతా నిశ్శబ్దంగా ఉంది. టీవీ మోగడంలేదు. మూడు నెలల తర్వాత గోపాల్రావు, దేవిక ఇండియా వెళ్ళిపోయారు.

రోజూ ఆఫీస్ నించి రాగానే అమ్మానాన్నల దగ్గర కూర్చునేవాడు. దేవిక ఇండియాలో వాళ్ళతో మాట్లాడిన కబుర్లు, విశేషాలు చెప్తుండేది.

ఆ రోజు సరాసరి పడకగదిలోకి వెళ్ళిపోయాడు. అతనికి తోచలేదు.

శ్రియ భోజనాల దగ్గర దేవిక వెళ్ళబోయే ముందు చేసి, ఫ్రీజర్లో పెట్టిన పదార్థాలు తీసి వేడిచేసింది.

ఇద్దరూ మౌనంగా ఎవరి ఫోన్ వాళ్ళు చూసుకుంటూ తినేసారు.

'అదేం తిండిరా! వంకాయ కూర బాగుందన్నావుగా. ఇంకో చెంచా వేసుకో' అనేవాళ్ళు లేరు. అప్రయత్నంగా కొంచెం అన్నం పెట్టుకుని కూరని ఇంకోసారి వేసుకున్నాడు.

"అత్తయ్య ఎంత బతిమాలేవారు, 'ఇంకో ముద్ద తినరా?' అని. పాపం నువ్వు మరీ కర్కశంగా బిహేవ్ చేసావు. 'నువ్వు పథ్నాలుగు రకాలు చేసి తినమంటే, పందిలాగా తయారవుతా' అనేవాడివి. ఆవిడ ఎంత బాధపడేవారో. అప్పటికీ నేనెన్నిసార్లు చెప్పాను, తర్వాత మళ్ళీ మన రొటీన్‌కి వద్దాం. వాళ్ళని బాధపెట్టద్దు అని" శ్రియ నెమ్మదిగా చెప్పింది.

భోజనం అయ్యాక శ్రియ ఆఫీస్ పని ఉందని లేప్‌టాప్ ఆన్ చేసింది. ఆకాశ్ లివింగ్ రూములో కూర్చుని టీవీ ఆన్ చేసాడు. సజెషన్స్ అన్నీ బ్లాక్ అండ్ వైట్ సినిమాలే. జగ్గయ్య బాగా యాక్ట్ చేస్తాడా, గుమ్మడి బాగా యాక్ట్ చేస్తాడా అని అమ్మానాన్నలు వాదించుకోవడం గుర్తొచ్చింది. హోరాహోరీ పోట్లాట తర్వాత కూడా అమ్మ వంటగదిలోకి వెళ్ళగానే వెనకాలే వెళ్ళి మాటలు చెప్తూ సహాయం చేసే నాన్న గుర్తొచ్చాడు. పోటీపడి ఇండియా కబుర్లు చెప్పే తల్లిదండ్రులు గుర్తొచ్చారు.

'నాన్నకి చాట్స్ తినాలని ఉందట్రా. ఈ వీకెండ్ ఇండియన్ రెస్టారెంట్‌కి వెళ్దాం' అని రికమెండ్ చేసే తల్లి, 'మీ అత్తగారిని చూడమ్మాయ్. ఆకాశ్ అంత కొడుకున్నాడని చెపితే బయటవాళ్ళు నమ్ముతారా?' అని కోడలితో గర్వంగా చెప్పే తండ్రి జ్ఞాపకం వచ్చారు.

కుటుంబం అంటే నిశ్చలమైన ఫేమిలీ పిక్చర్‌లాగా ఉండకూడదు. కంగాళీగా, శబ్దాలతో నిండి గందరగోళంగా ఉండాలి అనుకున్నాడు.

ఫోన్ మోగింది.

"ఆమెస్టర్‌డామ్ లో లేండ్ అయ్యాముర" తండ్రి కంఠం వినపడింది.

"నాన్నా, అన్నం తినేసావా? పృథ్వీ కోసం సాంబార్ చేసి, పేక్ చేసి, ఫ్రీజర్‌లో కుడివైపు పెట్టాను. వాడికి ఇవ్వు. శ్రియ ఎలా ఉంది? కాస్త హెల్ప్ చేస్తుండు" దేవిక కంఠం వినిపించింది.

"మళ్ళీ ఎప్పుడు వస్తారమ్మా?" ఆకాశ్ దిగులుగా అడిగాడు.

"ఇంకా వెళ్ళందే? పిచ్చి నాయనా. ఎటూ వచ్చే ఏడాది వస్తాంగా" దేవిక దుఃఖంగా చెప్పింది.

తర్వాత నెమ్మదిగా చెప్పింది.

"నాకు గుండె బరువుగా ఉంది."

(వచ్చే సంచికలో మరో సరిగమ)

Click here to share your comments